ప్రజాశక్తి
గురువారం 8 ఫిబ్రవరి 2024
5
పార్వతీపురం మన్యం

## 9న పార్వతీపురంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించుటకు ఈ నెల 9న పార్వతీపురంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆర్.వహీదా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుస్వదీప్ ఆగ్రో కంపెనీ 68 ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. జాబ్ మేళాను పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో 9న ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని తెలిపారు. విశాఖపట్నంలోని సుస్వదీప్ ఆగ్రో కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, బ్రాంచ్ ఇన్‌ఛార్జి, గోడౌన్ ఇన్‌ఛార్జి, డెలివరి బాయ్స్ ఉద్యోగాలకు 18 నుండి 48 ఏళ్ల పురుష అభ్యర్థులు అవసరమని చెప్పారు. 10వ తరగతి నుంచి డిగ్రీ చదివిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నెలకు రూ.13 వేల నుంచి 17 వేల వేతనం, ప్రోత్సాహకాలు చెల్లిస్తారని చెప్పారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.ncs.gov.in వెబ్‌సైట్‌లో జాబ్ సీకర్ లాగిన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

# నిరాశ

- ఏటా సాగునీటి రంగంపై నిర్లక్ష్యం
- పారిశ్రామికాభివృద్ధికి కానరాని కేటాయింపులు
- సంక్షేమ పథకాల కొనసాగింపుతో సరి
- నివ్వెరబోతున్న ప్రజానీకం

తోటపల్లి బ్యారేజ్

**రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వాసులను మరోసారి నిరాశకు గురిచేసింది. నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలకు కేటాయింపులు తప్ప, జిల్లా అభివృద్ధికి, తలసరి ఆదాయం పెంచేందుకు దోహదపడే విధంగా నిధులు కేటాయింపులు లేవు. ముఖ్యంగా 80శాతం ప్రజలు ఆధారపడే వ్యవసాయానికి అత్యంత కీలకంగా వున్న సాగునీటి రంగంపై ఎప్పటి మాదిరిగానే తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది.**

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంతో ఈసారి బడ్జెట్‌లోనైనా జిల్లా అభివృద్ధికి దోహదపడే సాగునీరు, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యతనిస్తారని, గతం కంటే బడ్జెట్ పెంచుతారని జిల్లా ప్రజానీకం ఆశించారు. ఆచరణలో అటువటిదేమీ కనిపించకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తోటపల్లి, రామతీర్థసాగర్ సాగునీటి ప్రాజెక్టులకు వందల రూ.కోట్లు కేటాయించాల్సి వుండగా గడిచిన నాలుగేళ్లలో అరకొరగా కేటాయించి, విడుదలలో మరింత కోత విధించారు. ఈసారి అటువంటి ఊరట కూడా కలగలేదు. అసలే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు పారిశ్రామికంగా వెనుకబడివున్నాయి. జ్యూట్ పరిశ్రమలు దాదాపు మూతపడ్డాయి. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు కొన ఊపిరితో నడుస్తున్నాయి. వీటిని ఆదుకునేందుకుగానీ, కొత్తపరిశ్రమల స్థాపనకుగానీ ఎలాంటి ప్రతిపాదనలు కూడా లేవు. మరోవైపు సేవారంగంలోనే జిల్లాకు తగిన కేటాయింపులు లేవు. ముఖ్యంగా వైసిపి అధికారంలోకి వచ్చాక సాగునీటి రంగంపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది.

64 వేల ఎకరాల పాత ఆయుకట్టును స్థిరీకరిస్తూనే కుడికాలువ ద్వారా అదనంగా 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో తోటపల్లి సాగునీటి ప్రాజెక్టును 2004లో చేపట్టారు. కేటాయించిన నిధుల్లోనూ విడుదలచేసిన మొత్తం ఇంకా తక్కువగానే ఉంది. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 వరకు రూ.201.98 కోట్లు కేటాయించగా ఆచరణలో ఖర్చుచేసింది రూ.63.24కోట్లు మాత్రమే. ప్రస్తుత ధరలు, లెక్కల ప్రకారం ప్రాజెక్టు పనులు పూర్తిచేయడానికి 567.57కోట్లు అవసరం కాగా, ఈ ఏడాది తక్కువలో తక్కువగా రూ.161.96కోట్లు అవసరమౌతాయని సంబంధిత ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదన పంపినప్పటికీ, ప్రాజెక్టుల వారీగా కేటాయింపులను ప్రభుత్వం ప్రకటించలేదు. ఇదే ప్రాజెక్టుకు గత ఏడాది నిర్మాణ పనులకు రూ.294.90కోట్లు, సిఎడిడబ్ల్యుఎం పనులకు రూ.107.69కోట్లు, భూసేకరణకు 46.38కోట్లు, అర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూ.107.06కోట్లు చొప్పున మొత్తం రూ.556.03కోట్లు కేటాయించాలని కోరుతూ ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపగా, కేవలం రూ.84.20కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులోనూ ఖర్చుచేసింది అక్షరాల ఆరు కోట్ల అరవై నాలుగు లక్షలు మాత్రమే. ఇలా ఏటా తగినంతగా విడుదల చేయకపోవడం వల్ల తరచూ కాంట్రాక్టర్ పనులు నిలిపివేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పెండింగ్ పనుల వల్ల సుమారు 68వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు.

### రామతీర్థసాగర్ కేటాయింపులు

| సంవత్సరం | ప్రతిపాదన | కేటాయింపులు | విడుదల |
|---|---|---|---|
| 2021-22 | రూ.201కోట్లు | రూ.21.83 | రూ.28.49కోట్లు |
| 2022-23 | రూ.124.50కోట్లు | రూ.43.41 | రూ.2.76కోట్లు |
| 2023-24 | రూ.150కోట్లు | రూ.60.62 | రూ.19.89కోట్లు |
| 2024-25 | రూ.399.18కోట్లు | స్పష్టత లేదు | రూ.???? |

పనులు చేపడుతున్న తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు (ఫైల్)

### తోటపల్లి కేటాయింపులు

| సంవత్సరం | ప్రతిపాదన | కేటాయింపులు | విడుదల |
|---|---|---|---|
| 2019-20 | రూ.156 కోట్లు | రూ.19.19 | రూ.13.65కోట్లు |
| 2020-21 | రూ.225.57కోట్లు | రూ.56.99 | రూ.37.28కోట్లు |
| 2021-22 | రూ.199.70కోట్లు | రూ.17.25 | రూ.1.35కోట్లు |
| 2022-23 | రూ.126.61కోట్లు | రూ.24.35 | రూ.4.32 |
| 2023-24 | రూ.80.84కోట్లు | రూ.84.20 | రూ.6.64కోట్లు |
| 2024-25 | రూ.361.96కోట్లు | స్పష్టత లేదు | రూ.???? |

### ఎప్పుడూ అంతంత మాత్రమే

తారకరామతీర్థసాగర్ జలాశయం, కాలువల నిర్మాణ పనులకు గడిచిన నాలుగేళ్లలో రూ.356.68కోట్లు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం, ఆచరణలో రూ.143.52కోట్లతో సరిపెట్టింది. ఈ ఏడాది రూ.399.18కోట్లు కేటాయించాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. తాజా బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు నిధులపై స్పష్టత లేదు. గత ఏడాది కూడా నిర్మాణ పనులు, ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణకు మొత్తం రూ.314.55కోట్లు కోరగా, రూ.60.62కోట్లు కేటాయించారు. ఈ రెండు ప్రాజెక్టులు తరువాత అత్యంత ప్రతిష్టాత్మకమైన జంఝావతికీ అంతంత మాత్రంగానే నిధులు కేటాయించారు. గత ఏడాది జంఝావతికి రూ.39.60లక్షలు, వెంగళరాయసాగర్‌కు రూ.14.72లక్షలు, మడ్డువలసకు రూ.17.57లక్షలు మాత్రమే కేటాయించారు.

తాటిపూడి, ఆండ్ర, పెద్దగెడ్డ, పెదంకలాం, డెంకాడ ఆనకట్టు, వట్టిగెడ్డ జలాశయాల ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎలాంటి సహకారమూ లేదు. జెఎన్‌టియు గురజాడ వర్శిటీలో అదనపు భవనాలు వంటి మౌలిక వసతుల కల్పనకు ఎటువంటి నిధులు లేవు. ఇలా ఒకటి కాదు... రెండు కాదు.. ఏకంగా అన్ని అంశాల్లోనూ జిల్లాకు ఒరిగిందేమీ కనిపించలేదు. కేటాయింపులన్నీ నవరత్నాలు, జగనన్న, వైఎస్‌ఆర్ పేరిట ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల పద్దుల్లోనే కనిపిస్తున్నాయి. వివిధ శాఖలకు కేటాయింపులు కూడా తగ్గడంతో ప్రభుత్వం చెప్పున్న సుస్థిరాభివృద్ధి మేడిపండేనంటూ పలువురు విమర్శిస్తున్నారు.

## ఎన్నికల ప్రసంగం మాదిరిగా బడ్జెట్

### సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్ర బడ్జెట్ ఎన్నికల ప్రసంగం మాదిరిగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీలో బుధవారం ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై తన స్పందన తెలియజేశారు. అభివృద్ధి లేని ప్రభుత్వ కోతల బడ్జెట్ అని అభిప్రాయ పడ్డారు. ప్రజలపై ఇప్పటికే వేసిన భారాలు చాలని చెప్పారు. బడ్జెట్ లోటును ప్రజలపై ధరలు పెంచి, భారాలు వేస్తూ పూడ్చుకోవాలని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంకెల గారడీతో ప్రజలను మోసగించడం జగన్ ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్యని పేర్కొన్నారు. జిల్లాలో నీటి వనరులు, విద్య, వైద్యం, ప్రజలకు ప్రయోజనం చేకూర్చే రంగాల్లో బడ్జెట్‌లో పైసా ప్రయోజనం లేదని వెల్లడించారు. ఈ బడ్జెట్‌ను ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు.

## యుటిఎఫ్ నాయకునిపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-పార్వతీపురం

యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.మురళీమోహన్‌పై నమోదైన కేసును ఎజెఎఫ్‌సిఎం కోర్టు బుధవారం కొట్టివేసింది. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే విలీనం జిఒ 117కు వ్యతిరేకంగా నిరసన చేపట్టడంతో 2022 ఏప్రిల్‌లో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారని, అనుమతి లేదనే అభియోగంపై కేసు పెట్టారు. ఈ కేసును పార్వతీపురం ఎజెఎఫ్‌సిఎం కోర్టు పరిశీలించి, మురళీమోహన్ నిర్దోషిగా తీర్పును వెలువరించింది. ఈ తీర్పుపై యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు.

# ఆశాలపై నిర్బంధం

- 'చలో విజయవాడ'కు వెళ్లకుండా ముందస్తు అరెస్టులు, అడ్డగింతలు
- సిఐటియు నాయకులపై గృహనిర్బంధం

పాలకొండలో ఆశాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గుమ్మలక్ష్మీపురంలో ఆశాలు, సిఐటియు నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధమవుతున్న ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులపై పోలీసులు నిర్బంధం ప్రయోగించారు. ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడ్డారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు, పనిభారం తగ్గించాలని, తదితర డిమాండ్లతో ఆశావర్కర్లు గురువారం చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధమవుతున్న ఆశావర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. సిఐటియు గుమ్మలక్ష్మీపురం మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో విజయవాడకు వెళుతున్న ఆశా వర్కర్లను పోలీసులు అడ్డుకొన్నారు. ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. **పార్వతీపురంటౌన్ ...** చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్ళనివ్వకుండా ఉండేందుకు ముందస్తుగా సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణకు పోలీసులు బెదిరింపు నోటీసులిచ్చారు. పోలీసుల చర్యలను మన్మథరావు ఖండించారు. అరెస్టులు చేసిన వారిని విడిచిపెట్టాలని, ఆశా వర్కర్లకు పాదయాత్రలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. **సాలూరు రూరల్** మండలంలోని మామిడిపల్లిలో ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, సాలూరులో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడును పోలీసులు గృహనిర్బంధం చేశారు. మరిపల్లిలో సిఐటియు జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావును సాలూరు రూరల్ ఎస్ఐ వెంకటరమణ హౌస్ అరెస్టు చేశారు. **కొమరాడ..** మండలంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్.రాజేశ్వరి, సిఐటియు జిల్లా నాయకులు కె.సాంబమూర్తిని పోలీసులు వారి ఇళ్ల వద్ద అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. **పాలకొండ..** పట్టణంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావును, ఇతర నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. రమణారావుతో పాటు 22 మంది ఆశా వర్కర్లను అరెస్టు చేశారు. **సీతానగరం..** చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా సిఐటియు జిల్లా నాయకులు వి.ఇందిర, జి.వెంకటరమణను పోలీసులు అరెస్టు చేసి, స్టేషన్‌లో నిర్బంధించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.



పార్వతీపురంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి మన్మథరావుకు నోటీసు అందజేస్తున్న పోలీసులు

## పడకేసిన పైలెట్ ప్రాజెక్టు..

# పల్లెల్లో దాహం కేకలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలో 65 గ్రామాలతోపాటు 25 మధుర గ్రామాలకు తాగునీరు అందించే బందలుప్పి- డోకిశిల పైలెట్ ప్రాజెక్టు పడకేసింది. అందులో తలెత్తిన సాంకేతిక సమస్యల వల్ల 12 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటికి పల్లెలు అల్లాడుతున్నాయి. మక్కువ మండలం డి.శిర్లాంలోని సువర్ణముఖి నదిలో ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో మోటార్లు పాడయ్యాయి. దీంతో పార్వతీపురం మండలంలోని పలు గ్రామాల ప్రజలతో పాటు డోకిశిల గిరిజన సంక్షేమ వసతిగృహం, కవిటిభద్ర కెజిబివి విద్యార్థులకు తాగునీరు సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

సువర్ణముఖి నది నుంచి 40 కిలోమీటర్ల దూరం వరకు పైపులైను అమర్చి పార్వతీపురం మండలంలోని 65 గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారు. కొద్ది రోజులుగా నది వద్ద మోటార్లు పాడవడంతో అన్ని గ్రామాలకు తాగునీరు రావడం లేదు. ఇక్కడ నిత్యం ఇదే సమస్య వేధిస్తున్నా అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్యను ఎంపిడిఒ అకిబ్ జావేద్, ఇఇ ప్రభాకర్ దృష్టికి వెళ్లగా ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో మరమ్మతులు చేస్తుండటంతో నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

పైలెట్ ప్రాజెక్టు ఇన్‌ఫిల్ట్రేషన్ బావి

### ఇసుక మేటలతో తరచూ సమస్యలు

డి.శిర్లాం వద్ద నదిలో నీటిని శుద్ధి చేసి ట్యాంకులకు సరఫరా చేసేందుకు ఇన్‌ఫిల్ట్రేషన్ బావులు తవ్వించారు. ఇక్కడ 12 మీటర్ల లోతు నుంచి మోటార్ల సాయంతో నీరు పంపింగ్ చేస్తారు. ఈ సమయంలో అడుగు భాగంలో ఇసుక మేటలు వేయడంతో ఫుట్ వాల్వులు, మోటార్లు ఇటీవల పాడయ్యాయి. ప్రస్తుతం వీటికి మరమ్మతులు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే సరికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రతి ఏటా ఇదే సమస్యతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుండటంతో దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

కమిషనర్‌కు వినతి అందిస్తున్న గ్రామాల నాయకులు

## మా గ్రామాల విలీనం వద్దు

### మున్సిపల్ కమిషనర్‌కి గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపాలిటీలో కూర్మరాజుపేట, జీగిరాం, నెలిపర్తి గ్రామాలను విలీనం చేయొద్దని కోరుతూ బుధవారం ఆయా గ్రామాల నాయకులు మున్సిపల్ కమిషనర్ పి.ప్రసన్నవాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. కూర్మరాజుపేట సర్పంచ్ ఆముదాల నళిని ఆధ్వర్యాన గ్రామస్తులు, జీగిరాం, నెలిపర్తి నాయకులు వై.గణపతి, గాంధీ,బంగారి సురేష్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలోనూ ఈ ప్రతిపాదన తీసుకొస్తే గ్రామస్తులంతా తీవ్రంగా వ్యతిరేకించారని చెప్పారు. ఇప్పుడు మళ్లీ ఆ ప్రతిపాదనను తెరపైకి తేవడం సరికాదని తెలిపారు. గ్రామాల్లో ఉన్నవారంతా బలహీనవర్గాల కుటుంబాలేనని, మున్సిపాలిటీలో విలీనం చేయడం వల్ల పన్నుల భారం పడుతుందని చెప్పారు. ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని, లేకపోతే తీవ్ర ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూర్మరాజుపేట నాయకులు కోటేశ్వరరావు, వెంకట్రావు, ఈశ్వరరావు, సింహాచలం, మోహన్ రావు పాల్గొన్నారు.

## రక్తహీనత రహిత జిల్లాగా ఆవిర్భవించాలి

### కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి -పార్వతీపురం

రక్తహీనత రహిత జిల్లాగా ఆవిర్భవించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. జిల్లాలో ప్రిజమ్ - 10 ప్రాజెక్టు అమలు, అభిలాష తదితర అంశాలపై మండల అధికారులతో జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. గర్భిణుల్లో రక్తహీనత సమస్య నివారించుటకు ఎంపిడిఒ పర్యవేక్షణలో గ్రామ, వార్డు స్థాయిలో ఆశా, ఎఎన్ఎం, అంగన్వాడి కార్యకర్త, మహిళా పోలీసుతో బృందాన్ని ఏర్పాటుచేశామన్నారు. రక్తహీనత గల గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలను గుర్తించి క్రమం తప్పకుండా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేయడం, పౌష్టికాహారం తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. రక్తహీనత రహిత జిల్లాగా ఆవిర్భవించాలని చెప్పారు. హై రిస్క్ కేసులు అనేకం నివారించామన్నారు. సంబంధిత జాబితా ప్రతి సచివాలయంలో ఉందని తెలిపారు. పాచిపెంట మండలం మంచి పనితీరు కనబరిచిందని ఆయన ప్రశంసించారు. మాత, శిశు మరణాలు నియంత్రణ ముఖ్య ధ్యేయంగా ప్రిజమ్‌ను జిల్లాలో ప్రత్యేకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. గర్భిణులను గుర్తించాలని, నమోదు చేయాలని వారిలో రక్త హీనత నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆశాలు ఇంటింటికీ వెళ్లి గర్భిణులను గుర్తించాలని ఆయన ఆదేశించారు. తద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఆర్థిక సహాయం, వైద్యం అందుతుందన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించే ప్రదేశాల్లో అవగాహన కల్పించాలని స్పష్టంచేశారు. టేక్ హోం రేషన్‌ను గర్భిణులు మాత్రమే తీసుకోవాలని ఆదేశించారు. ఇమ్యూనైజేషన్ శత శాతం జరగాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్ల స్పందనను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కిల్కారి వాయిస్ కాల్‌ను ఉపయోగించుకోవాలని ఆయన చెప్పారు.

### 9న డి వార్మింగ్ డే

ఈ నెల 9న డి వార్మింగ్ డేను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల వారికి ఆల్ బెండజోల్ మాత్రలు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం యువతకు భరోసాగా నిలుచుటకు 'అభిలాష' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. గ్రామ సచివాలయాలలో అభిలాష గ్రంథాలయాలు ప్రారంభం అయ్యాయని చెప్పారు. గ్రంథాలయాల్లో 66 రకాల పుస్తకాలను రెండు సెట్లు చొప్పున ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథ రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నారాయణరావు, ప్రిజమ్ నోడల్ అధికారి ఎం.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక, రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు బంటు దాసు

## 16న గ్రామీణ బంద్

### విజయవంతం చేయాలని కార్మిక, రైతుసంఘాల సమన్వయ కమిటీ పిలుపు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మోడీ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కార్మిక, రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో రైతు సంఘం నాయకులు పి.అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు బంటు దాసు మాట్లాడారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేసి, 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాల ధరలను తగ్గించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలన్నారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా పంట రుణాలు, గుర్తింపు కార్డులు, పంట నష్టం అందించాలన్నారు. ఉపాధిహామీ పనిదినాలను 200 రోజులకు విస్తరించి, రోజు వేతనం రూ.600 చెల్లించాలని, పట్టణాల్లో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ప్రజలను రక్షించండి, దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఈ దేశవ్యాప్త గ్రామీణబంద్ జరుగుతుందని వివరించారు. బంద్‌లో ఉద్యోగులు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పి.రమణి, కె.మన్మథరావు, ఆర్.లక్ష్మునాయుడు, శ్రీ నాయుడు, నర్సింగరావు, వి.ఇందిర, సూరిబాబు, జి.వెంకట రమణ, టి.జీవ, రంజిత్, పి.సంఘం, కొల్లి గంగు నాయుడు, సూరయ్య, వై.మన్మథరావు, సర్వేశ్వర రావు, విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

## ఓటరు జాబితా అప్‌డేట్

ప్రజాశక్తి-పార్వతీపురం

ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఓటరు జాబితా అప్‌డేట్ చేస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చేపట్టిన వివరాలను తెలిపారు. ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నిలుపుదల చేసే వరకు అప్ డేట్ చేస్తామని చెప్పారు. ఇవిఎం, వివిపాట్లపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతోపాటు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జ్ డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అడలి టెండరు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-పార్వతీపురం

సీతంపేట మండలం అడలి రెస్టారెంట్, క్యాంపింగ్ టెంట్లు, వ్యూ పాయింట్లకు టెండరు గడువు ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా పర్యాటక మండలి చైర్మన్, జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అడలి వద్ద 1.34 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన పర్యాటక ప్రదేశంలో రెస్టారెంట్, క్యాంపింగ్ టెంట్లు, వ్యూ పాయింట్లను, కనీసం మూడు సంవత్సరాలు అనుభవం కలిగి ఆసక్తి గల వ్యక్తులు, సంస్థల నుండి బిడ్లు కోరుతున్నట్లు చెప్పారు. 7వ తేదీ వరకు ఉన్న గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించామని చెప్పారు. వివరాలకు https://parvathipuram manyam.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. వివరాలకు జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి (89191 68306) ని సంప్రదించవచ్చని తెలిపారు.

## కురుపాం పిఎసిఎస్ అధ్యక్షులుగా శంబంగి లీల

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులుగా పూతికవలసకు గ్రామానికి చెందిన శంబంగి లీల నియమితులయ్యారు. సభ్యులుగా గవర విజయ చంద్రశేఖర్, అద్దేపల్లి భాస్కరరావును నియమించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర సహకార శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కొదంగోల గౌరీశంకర్ అధ్యక్షులు ఉండగా ఆయన స్థానంలో లీలను నియమించారు. ఈ సందర్భంగా లీల మాట్లాడుతూ పిఎసిఎస్ అభివృద్ధికి అందరినీ కలుపుకుని పనిచేస్తానని, రైతుల ప్రయోజనాలకు కృషి చేస్తానని చెప్పారు.

కిశోర్‌తో మాట్లాడుతున్న పడాల భూదేవి

## కిశోర్‌ని కలిసిన భూదేవి

ప్రజాశక్తి - కురుపాం

కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్‌ను కురుపాంలో తన కోట వద్ద బుధవారం టిడిపి పాలకొండ నియోజకవర్గ సీనియర్ నాయకులు పడాల భూదేవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలకొండ నియోజకవర్గంలో టిడిపి పరిస్థితులను ఆయనకు వివరించారు. బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం అమలు వివరాలను వెల్లడించారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ గెలుపునకు ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు.

## జెజెఎం పనులపై శిక్షణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జలజీవన్ మిషన్ పనులపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్, వైఎస్ఆర్ క్రాంతి పథం సిబ్బంది, ఇంజినీరింగ్ సహాయకులకు శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జగదీష్ కుమార్ మాట్లాడుతూ మండలంలో ఇటీవల మంజూరైన 216 ఇంటింటికి కుళాయి కనెక్షన్లను సంబంధించి ఆయా ఇంజనీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు వ్యక్తిగత బ్యాంకు ఖాతాలను తెరవాలని కోరారు. మండలంలో ఇప్పటి వరకు 79 గ్రామాలలో ఇంటింటికి కుళాయి పనులు పూర్తి అయ్యాయని, తెలిపారు. మిగతా 137 గ్రామాలలో కుళాయి కనెక్షన్లు పనులు పూర్తిచేయాలని సూచించారు. మండలంలో అమలవుతున్న జల్‌జీవన్ మిషన్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఆదయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెంపలమ్మకు రూ.2 లక్షల నగదు అందజేస్తున్న జగదీశ్వరి

## టిడిపి కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని నెల్లికెక్కువ పంచాయతీ వాడపుట్టి గ్రామానికి చెందిన పువ్వల శ్రీహరి బొలెరో వాహనం బోల్తా పడి మరణించాడు. శ్రీహరి టిడిపి సభ్యత్వం నమోదు చేసుకోవడంతో ఆ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రూ.2లక్షలు అందించారు. ఆ నగదును శ్రీహరి భార్య చెంపలమ్మకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి దాసు, ధర్మ, ఎస్‌టి సెల్ కార్యదర్శి నరేష్, నాయకులు అనిల్, సంతు, అన్నిబాబు ఉన్నారు.

## టిడిపి నాయకులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలో కొంతమంది టిడిపి నాయకులు ప్రజల వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారని, అటువంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని సాలూరు రూరల్ ఎస్‌ఐ ఎం.వెంకటరమణకు వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ ఫిర్యాదుచేశారు. గ్రామాలలో ఉండే సర్పంచులు, ఎంపిటిసిలు, వాలంటీర్లు జాగ్రత్తగా ఉండాలని సురేష్ కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ పాల్గొన్నారు.

చేపలు విక్రయిస్తున్న గిరిజనులు

ఏజెన్సీ ప్రాంతాల్లో సుస్థిర సాగుకు 30 సంవత్సరాలుగా సహకారం అందిస్తోంది... ఆర్ట్స్ సంస్థ. గిరిజన ప్రాంతాల్లో సహజ వనరుల అభివృద్ధిలో భాగస్వామ్యమౌతోంది. సాగునీటి వనరుల సంరక్షణ కోసం వాటర్‌షెడ్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. నేల కోతను తగ్గించడం, పంటలకు ఉత్పత్తిని పెంచడం, సహజ పద్ధతుల నుంచి సేంద్రియ పంటలు పండించడం, రైతుల జీవనోపాధులు మెరుగు పరచడం.. ఇలా అనేక రకాలుగా గిరిజనానికి మార్గనిర్దేశం చేస్తూ, అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తోంది.

# ఆదివాసీల అభివృద్ధికి.. ఆర్ట్స్ సుస్థిర సేద్యం

నిర్మించిన చెక్ డ్యామ్

- 30 ఏళ్లుగా గిరిజనానికి అండగా నిలుస్తున్న సంస్థ
- ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు కృషి
- ఏజెన్సీలో మారుతున్న రూపురేఖలు

ప్రజాశక్తి-సీతంపేట

ఆదివాసీల ఆర్థికాభివృద్ధే లక్ష్యంతో 1993లో నూక సన్యాసరావు అనేక వ్యక్తి ఆర్ట్స్ సంస్థను ఏర్పాటు చేశారు. ఆయనే డైరెక్టర్‌గా ఉంటూ శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం పెద్దపేట గ్రామంలో కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. ఆదివాసీ ప్రాంతాల్లో భూమి అభివృద్ధి కార్యక్రమం చేపట్టి వాటి ద్వారా పంటలు పండించే ప్రయత్నాలు చేశారు. వన సంరక్షణ సమితులు ఏర్పాటుచేసి అటవీ సంరక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా సహజ వనరులు అభివృద్ధి చెందితే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందనే ఉద్దేశంతో ఆర్ట్స్ సంస్థ ద్వారా సీతంపేట ఏజెన్సీలో వాటర్ షెడ్ కార్యక్రమాలు నిర్వహించారు. వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలు అభివృద్ధి చెందడానికి మండలంలో కుసిమి, పెద్దూరు, మండ, గోయిది, సిలగాం, హడ్డుబంగి, సోమగండి, సీతంపేట, కోసంగి, సామరెల్లి, తదితర పంచాయతీల్లో చెక్‌డ్యాములు, రాతికట్లు, కందకాలను ఏర్పాటు చేశారు.

నేల కోతను నివారించి, రెండు పంటలు పండే విధంగా భూమిని తయారు చేశారు. సమీకృత వ్యవసాయ విధానం ద్వారా వ్యవసాయ పంటలు, చిరుధాన్యాలు సాగుచేశారు. ఉద్యాన పంటలు జీడి, పైనాపిల్, పసుపు వంటి పంటలు అభివృద్ధి చేయడానికి ఆర్ట్స్ సంస్థ సహకారం అందించింది. నాటు కోళ్ల పెంపకం ద్వారా అదనపు ఆదాయాలు చేకూర్చింది. 52 చెరువులు తవ్వించి చేపల పెంపకం కార్యక్రమాలు నిర్వహించారు. ఒక్కొక్క రైతుకు రూ.25 వేలు నుంచి రూ.50 వేల వరకు అదనపు ఆదాయం వచ్చే విధంగా కృషి చేసింది.

నాబార్డు సహకారంతో సహజ వనరులను అభివృద్ధి చేసి, రెండు పంటలు పండించి సమీకృత వ్యవసాయ విధానం ద్వారా సుస్థిరమైన అభివృద్ధిని రైతులకు అందిస్తోంది. ఐటిడిఎ, వ్యవసాయ, ఉద్యాన శాఖల సహకారంతో ప్రకృతి రక్షణతో పాటు రైతుల ఆదాయాలు పెంపొందించేలా కృషి చేస్తోంది. ఇలా అనేక కార్యక్రమాలు చేపడుతూ ఆర్ట్స్ సంస్థ ఆదివాసీలకు అండగా నిలుస్తోంది. అందరి మన్ననలు అందుకుంటోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక ప్రశంసలు, అవార్డులు పొందుతోంది.

### చేపల పెంపకంతో మంచి ఆదాయం

ఆర్ట్స్ సంస్థ వాటర్ షెడ్ పనులు నిర్వహించడం వల్ల నీటి వసతి ఉంటోంది. దీనివల్ల చేపల పెంపకం, కూరగాయల పంటలు పండిస్తుంది. చేపల పెంపకం వల్ల మంచి ఆదాయం లభిస్తోంది. ఏడాదికి రూ.50 వేల వరకు ఆదాయం వస్తోంది.

- కె.గౌరమ్మ, రైతు, చిన్న రామ

### చెరువుల తవ్వకంతో రెండు పంటలు

ఆర్ట్స్ సంస్థ ఏజెన్సీలో చెరువులు తవ్వించడం వల్ల ఏడాదికి రెండు పంటలు పండించుకుంటున్నాం. చెరువులో చేపల పెంపకం వల్ల అదనపు ఆదాయాలు వస్తున్నాయి. పంటల సాగుకు అవలంబించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. 30 సంవత్సరాలుగా మాకు సహాయం అందిస్తున్నారు.

- బి.పార్వతమ్మ, రైతు, చిన్నరామ

### జీవనోపాధులు పెంపొందించడం లక్ష్యం

ఆదివాసీ ప్రాంతాల్లో ఆదివాసీలకు జీవనోపాధులు పెంపొందించడమే ఆర్ట్స్ సంస్థ లక్ష్యం. నాబార్డు సహకారంతో 30 సంవత్సరాలుగా గిరిజనులకు ఆర్ట్స్ సంస్థ ఆర్థిక స్వావలంబన అందిస్తోంది. సేంద్రీయ పద్ధతిలో పంటలు పండించి రైతులకు మేలు చేయడానికి నావంతు కృషి చేస్తున్నాను. వాటర్ షెడ్ కార్యక్రమాలు నిర్వహించి నీటి కొరత లేకుండా చూస్తున్నాం.

- నూక సన్యాసిరావు, ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్

## ఎన్నికల నిర్వహణకు వసతుల పరిశీలన

పాలకొండ.. సౌకర్యాలను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ప్రజాశక్తి - కురుపాం

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులను పాలకొండ ఆర్‌డిఒ వి.వి.రమణ బుధవారం తహశీల్దార్ వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న పోస్టు మెట్రిక్ హాస్టల్ భవనాలు, సౌకర్యాలు, ఇతర వసతులను పరిశీలించారు. ఎన్నికల మెటీరియల్ భద్రత, ఇవిఎం స్ట్రాంగ్ రూం ఏర్పాటుకు అవసరమైన అదనపు భద్రత సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గత ఎన్నికలు కూడా ఇదే భవనం నుండే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కరుణాకర్, విఆర్‌ఒ మహేంద్ర పాల్గొన్నారు.

**పాలకొండ :** పాలకొండ నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూం ఏర్పాటుకు పాలకొండలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలను ఐటిడిఎ పిఒ కల్పనకుమారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్‌రూం ఏర్పాటుకు అవసరమయ్యే అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయా? లేవా? అని పరిశీలించారు. కళాశాలలో ఉండే సౌకర్యాలపై ప్రిన్సిపల్ శంకరరావును అడిగి తెలుసుకున్నారు. అన్ని సదుపాయాలున్న భవనాన్ని స్ట్రాంగ్ రూం కోసం ఎంపిక చేస్తామని పిఒ తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ వరహాలు, డిప్యూటీ తహశీల్దార్ బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

## డి-వార్మింగ్‌తో రక్తహీనత నివారణ

కురుపాం.. సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ సత్యనారాయణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

డివార్మింగ్ కార్యక్రమం ద్వారా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం నివారించవచ్చని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. కృష్ణపల్లి, చినమరికి గ్రామాల్లో వెల్నెస్ కేంద్రాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 9న నిర్వహించనున్న డి వార్మింగ్ డే కార్యక్రమానికి అవసరమైన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ, అర్హులైన పిల్లలు, విద్యార్థులు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు తదితర వివరాలపై ఆరా తీశారు. అందరి సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అక్కడ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పంపిణీ చేసిన ఆల్బెండజోల్ మాత్రల స్టాక్ తనిఖీ చేశారు. విద్యార్థులకు వీటి ఆవశ్యకతను వివరించారు. అనంతరం అక్కడ వెల్నెస్ కేంద్రాల్లో ఆరోగ్య తనిఖీల రికార్డులను, అందుబాటులో ఉంచిన మందులను, వైద్య పరికరాలను పరిశీలించారు. ఇ-సంజీవిని ద్వారా ఎంతమందికి వైద్య సేవలు అందజేశారు, గర్భిణులకు కిల్కారీ సేవలపై ఆరా తీశారు. జ్వర నిర్ధారణ పరీక్షలు సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది టి.శిరీష, పి.నిర్మల, సిహెచ్ కృష్ణవేణి, బంగారునాయుడు, కన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**కురుపాం :** 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా మింగించాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో ఏర్పాటుచేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 9న చేపట్టే డివార్మింగ్ డే కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించి, విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

**సాలూరు :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకాలంలో నులిపురుగుల మాత్రలు పంపిణీ చేయాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ శివకుమార్ కోరారు. బుధవారం పట్టణంలోని నాయుడువీధి సచివాలయంలో ఎంఇఒ, ఎంపిడిఒ కార్యాలయాల సిబ్బందికి పాఠశాలల విద్యార్థులకు పంపిణీ కోసం డివార్మింగ్ మాత్రలు అందజేశారు. ఈ నెల 9న జాతీయ డీ వార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పిపి యూనిట్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్.. ఆల్బెండజోల్ మాత్రలపై అవగాహన కల్పిస్తున్న డిఎంఒ జగన్మోహనరావు

## రహదారి భద్రతపై ప్రతిఒక్కరికీ అవగాహన

కురుపాం.. రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌టిఒ మల్లికార్జున్

ప్రజాశక్తి - కురుపాం

రహదారి భద్రతపై ప్రతీ వాహనదారుడికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఆర్‌టిఒ సి.మల్లికార్జున్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో మొండెంఖల్ గ్రామంలో ప్రజలకు, ఆటో డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించి, తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనం నడప రాదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపకూడదని, ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ, సర్పంచులు ఐ.గౌరీశంకర్, కళావతి, టిఆర్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం :** జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రత మాసోత్సవాలను గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో మోటార్ వెహికల్ డ్రైవర్లు, సిబ్బందితో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు.

గుమ్మలక్ష్మీపురం.. ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, డ్రైవర్లు

ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు, యువత

## నిరుద్యోగులతో ఆటలాడుతున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతంపేట

నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ విమర్శించారు. డిఎస్‌సి నోటిఫికేషన్‌పై నిరుద్యోగ యువతతో సీతంపేటలో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక టిడిపి కార్యాలయం నుంచి ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది మెగా డిఎస్‌సి కాదని, దగా డిఎస్‌సి అని ధ్వజమెత్తారు. ఏటా జాబ్ కేలండర్ ప్రకటిస్తామని హామీనిచ్చి, పూర్తిగా విస్మరించారని విమర్శించారు. నిరుద్యోగ యువతతో ఆటలాడుకుంటున్న సిఎం జగన్‌కి గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో ఇంటికి పంపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సవరతోట మొఖలింగం, బిసి సెల్ అధ్యక్షులు ఆర్ రంగనాథం, ఎస్‌సి సెల్ అధ్యక్షులు గంట సుధ, ఐటిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇమరక పవన్, తెలుగు యువత అధ్యక్షులు సవర సంతోష్ కుమార్, ప్రచారకర్త తోయక సంధ్యారాణి, క్లస్టర్ ఇన్‌ఛార్జి నిమ్మక చంద్రశేఖర్, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల పట్ల గౌరవం పెంపొందించాలి

ప్రజాశక్తి-సాలూరు

తల్లిదండ్రుల కాళ్లకు పూజ చేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల్లో తల్లిదండ్రుల పట్ల గౌరవం, మర్యాద పెంపొందించే విధంగా వారిలో సత్ప్రవర్తన కోసం కృషి చేయాలని శ్రీవెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు కోరారు. బుధవారం పట్టణంలోని ఆర్యవైశ్య ధర్మశాలలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన నిర్వహించిన తల్లిదండ్రుల పాదపూజ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పెరిగి పెద్ద వారైన తర్వాత తల్లిదండ్రులను దూరం పెడుతున్నారని, వారు అనాథలుగా బతకాల్సిన పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా పాఠశాలల్లోనే తల్లిదండ్రులను ఎలా పూజించాలి, గౌరవించాలనే అంశాలు నేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రుల కాళ్లను పల్లాలలో ఉంచి పసుపు, కుంకుమ, పూలు జల్లి మంచినీటితో కడిగి శుభ్రం చేశారు. కడిగిన నీళ్లను తలపై వేసుకున్నారు. తమ పిల్లలు కాళ్లు కడుగుతున్నప్పుడు కొంతమంది తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమం నిర్వహించిన విధానం పట్ల కోడూరు సాయి శ్రీనివాసరావును ప్రముఖ వైద్యులు ఎ.మోహనరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి, అకడమిక్ డైరెక్టర్ మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

స్తంభాన్ని తొలగిస్తున్న క్రేన్

పట్టణ ప్రధాన రహదారిలో నాలుగు రోడ్ల కూడలిలో సెంటర్ లైటింగ్ విద్యుత్తు స్తంభాన్ని బుధవారం తెల్లవారు జామున లారీ ఢీకొంది. దీంతో విద్యుత్తు స్తంభం ఒక పక్కకు పూర్తిగా ఒరిగి, మెయిన్ లైన్ తీగలపై వాలిపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. విశాఖపట్నం నుంచి ఒడిశా వైపు వెళ్తున్న బొగ్గు లారీ నాలుగు రోడ్ల కూడలి వద్ద మలుపు తిరుగుతుండగా ఈ సంఘటన జరిగింది. ఆ సమయంలో ఎలాంటి నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు సమాచారం అందించడంతో పట్టణ పోలీసులు, మున్సిపల్ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. క్రేన్ సహాయంతో విద్యుత్తు, మున్సిపల్ సిబ్బంది స్తంభాన్ని కిందకు దించారు. పట్టణ పోలీస్‌స్టేషన్లో లారీ డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు యజమానిపై కేసు నమోదు చేశారు. పడిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు అంచనాలు తయారుచేసి లారీ యజమాని నుంచి వసూలు చేస్తామని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

## జెఎఎస్‌తో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జగనన్న ఆరోగ్య సురక్షతో దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స చేయనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. బుధవారం పట్టణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గౌరీశ్వరి, కమిషనర్ పొందూరు సింహాచలం పాల్గొన్నారు. వైద్య సేవలను వారు పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, 19వ వార్డు కౌన్సిలర్ బొదయ్య, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.